నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 20 అక్టోబర్ 2024 | SANGAREDDY


సిద్దిపేట మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సాగుకు నాణ్యమైన కరెంట్ అందించాలి

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 19: యాసంగి సాగుకు ఎలాంటి అంతరాయం లేకుండా రైతులకు నాణ్యమైన 24గంటల కరెంటు ఇవ్వాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. శనివారం సిద్దిపేట మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో ముచ్చటించారు. చుట్టుపక్కల మండలాల నుంచి తెచ్చిన వడ్లను కొనుగోలు చేయడం లేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అన్ని మండలాల నుంచి తెచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లు, పంట రుణమాఫీ, రైతు భరోసా కోసం రైతుల పక్షాన పోరాడుతామని అన్నదాతలకు భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన విధంగా నాణ్యమైన 24గంటల కరెంటు ఇవ్వాలన్నారు. సాయంత్రం ఐదు గంటలకు పోయి ఉద యం మూడు గంటల దాకా త్రీఫేస్ కరెంటు ఉం డడం లేదన్నారు. లోఓల్టేజీ సమస్యతో మోట ర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు. కొనుగో లు కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి రైతుకు మద్దతు ధరను అందించాలని, పామాయిల్ రైతులకు రెం డో విడత మెయింటెనెన్స్ డబ్బులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని హరీశ్‌రావు కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటలో అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

సిద్దిపేట, అక్టోబర్19: సిద్దిపేట నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారులకు సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోఆపరేటివ్ చైర్మన్లు, సివిల్ సప్లయ్, డీఎస్‌వో, మార్కెటింగ్, కోఆపరేట్ అధికారులు, నియోజకవర్గంలోని మండలాల ఏపీఎంలతో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా కేంద్రాలపై ఆరాతీశారు. చిన్నకోడూరు మండలం రామంచ, నంగునూర్ మండలంలో ఒకటి, సిద్దిపేట రూరల్‌లో మూడు కేంద్రాలు, అర్బన్ మండంలోని మందపల్లిలో ఒకటి, నారాయణరావుపేటలో ఒక కొనుగోలు కేంద్రం ప్రారంభమైందని అధికారులు హరీశ్‌రావుకు వివరించారు. విగతా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఏపీఎంలను హరీశ్‌రావు ఆదేశించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ అధికారులకు ఫోన్‌లో సూచించారు.

నర్మెటలో ఇరు పార్టీల నేతలను అడ్డుకుంటున్న పోలీసులు(ఇన్‌సెట్‌లో) సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న దృశ్యం

ఆయిల్‌పామ్ అవగాహన సదస్సు వద్ద ఆందోళన

రైతులను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

నంగునూరు, అక్టోబర్ 19: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో శనివారం ఆయిల్‌పామ్ రైతులకు జరిగిన అవగాహన కార్యక్రమం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పోటాపోటీ నినాదాలు చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రికి, జిల్లా మంత్రికి సమాచారం లేకుండా ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎలా హాజరవుతారని కాంగ్రెస్ నాయకులు నిరసనకు దిగారు. ఆయిల్‌పామ్ రైతుగా గుర్తింపు ఉన్నవారే అవగాహన సదస్సుకు వెళ్లాలని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. కార్యక్రమానికి వెళ్తున్న రైతులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులు సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయగా..కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు ఇరు పార్టీల నాయకులను చెదరగొట్టారు. చివరకు ఆయిల్‌పామ్ రైతులుగా గుర్తింపు ఉన్న వారిని మాత్రమే సమావేశానికి అనుమతించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి.. కాంగ్రెస్ నాయకుల తీరు సరికాదని.. వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారుల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించినా కాంగ్రెస్ నాయకులు కావాలని రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. అనంతరం రైతుభరోసా విడుదల చేయకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు తగుల బెట్టేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

కిట్లు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం

బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి


గజ్వేల్ మాతాశిశు దవాఖానలో మహిళలతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 19: ప్రభుత్వ దవాఖానల్లో కేసీఆర్, న్యూట్రీషన్‌ను కిట్లను అందించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజవకర్గ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్‌లోని మాతాశిశు దవాఖానను సందర్శించి గర్భిణులు, వైద్యులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతాశిశు దవాఖానలో పది రోజుల్లో అవసరమైన పరికరాలను సమకూర్చి పూర్తిస్థాయిలో సేవలు వినియోగంలోకి తీసుకరావాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యాఆరోగ్య శాఖ మంత్రి రాజానర్సింహ దీనిపై దృష్టి సారించాలని కోరారు. కేసీఆర్ హయాంలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో నియోజకవర్గ కేంద్రాల్లో అత్యధునిక హంగులతో దవాఖానలను నిర్మించారని, గజ్వేల్‌లో రూ.28కోట్లతో మాతా శిశు దవాఖానను నిర్మించి రూ.10కోట్లతో ఒకటి, రెండు మినహా అన్ని రకాల పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. దవాఖానలో లేని పరికరాలను వెంటనే ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. గతంలో ఈ దవాఖానలో 80 శాతం సాధారణ ప్రసవాలు జరిగితే, నేడు ప్రసవాల సంఖ్య తగ్గిందన్నారు. మందులు ప్రైవేట్‌లో తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, చందు, మల్లేశం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ కోఅప్షన్ సభ్యుడు అహ్మద్, నాయకులు ఆర్‌కే శ్రీను, భూపాల్‌రెడ్డి, కల్యాణ్‌కర్ శ్రీను, సాయి తదితరులు ఉన్నారు.

శనివారం గజ్వేల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతు భరోసాకు రాంరాం !

- ప్రభుత్వ తీరుపై భగ్గుమన్న రైతులు
- గ్రామాల్లో సీఎం దిష్టిబొమ్మల దహనం, పలుచోట్ల రాస్తారోకోలు
- నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు

అన్నదాతలకు చేయిచ్చిన కాంగ్రెస్ సర్కారు

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు, నాయకులు, గజ్వేల్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

సిద్దిపేట, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణప్రతినిధి): రైతులకు ఇన్ని రోజులు ఊరించి..వానకాలం పంటకు రైతుభరోసా లేదని కాంగ్రెస్ ప్రభుత్వం చావుకబురు చల్లగా చెప్పింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటనపై రైతులు భగ్గుమంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చి తప్పిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబంధు (రైతుభరోసా) రెట్టింపు చేసి ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తీరా ఓట్లుపడి అధికారంలోకి వచ్చాక రైతులకు మొండిచేయి చూపింది.సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో శనివారం రైతులు ఎక్కడికక్కడ తమ నిరసనలు తెలియజేశారు. పలుచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాగా, ఎన్నికల ముందు మాట ఇచ్చి తప్పిని కాంగ్రెస్ సర్కార్ తీరును ఎండగట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్ శ్రేణులు, రైతులకు పిలుపునిచ్చారు.ఆదివారం అన్ని మండలకేంద్రాల్లో రైతులు,బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. రైతుభరోసా, రుణమాఫీ పూర్తి చేసేవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విడిచిపెట్టేది లేదని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు చేయూత లభించడం లేదు. సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదు. వానకాలం రైతుబంధు (రైతభరోసా) ఇవ్వలేదు. కరెంటు, సాగునీటి కష్టాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేండ్లు కరోనా తో ఆర్థిక పరిస్థితి దిగజారినా రైతులకు అప్పట్లో సీఎం కేసీఆర్ రైతుబంధు ఇచ్చి ఆదుకున్నారని రైతులు గుర్తుచేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 విడతల్లో రూ.8,771 కోట్ల రైతుబంధు రైతుల ఖాతాల్లో జమచేసింది. ఆ డబ్బులు పంట పెట్టుబడికి రైతులకు ఎంతగానో అక్కరకు వచ్చాయి. కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ప్రారంభించి నాటి నుంచి గతేడాది వానకాలం వరకు(11వ విడతల్లో) సిద్దిపేట జిల్లాలో 29,33,494 మంది రైతులకు రూ. 3,124.82 కోట్లు, మెదక్ జిల్లాలో 24,69,637 రైతులకు రూ.2,027.37 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 31, 95,960 మంది రైతులకు రూ.3,619.54 కోట్లు, మొత్తం ఉమ్మడి మెదక్ జిల్లా లో 85,99,091 మంది రైతులకు బీఆర్ఎస్ ప్రభు త్వం రూ.8,771.73 కోట్లు రైతుబంధు అందించి రైతులకు దన్నుగా నిలిచింది.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్: రాధాకృష్ణశర్మ

చిన్నకోడూర్, నవంబర్ 19: రైతుభరోసా ఇవ్వకుండా రైతులను మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ విమర్శించారు. రైతు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని శనివారం చిన్నకోడూరులో రైతులు ధర్నా చేసి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలేటి రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ.. సగం మందికే రుణమాఫీ చేసి కాంగ్రెస్ రైతులను మోసం చేసిందన్నారు. ఇప్పుడు రైతుభరోసా ఇవ్వకుండా మరోసారి మోసం చేసిందన్నారు. రైతు భరోసాపై కాలయాపనకే సబ్ కమిటీ వేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, పోచబోయిన శ్రీహరి యాదవ్, కీసర పాపయ్య, మేడి కాయల వెంకటేశం, ఉమేశ్‌చంద్ర, జంగిటి శ్రీనివాస్ గుండెల్లి వేణు, గుజ్జరాజు, కొండం రవీందర్ రెడ్డి, ముసర్ల మధుసూదన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రఘు రైతులు పాల్గొన్నారు.

సర్కారు ఇయ్యకుంటె ఎట్ల..

సర్కారు ఎవుసం పెట్టుబడి ఇయ్యకుంటే రైతులకు ఎవ్వలు సాయంసెయ్యాలే. కేసీఆర్ ఉన్నప్పుడు రెండుమాట్ల రైతులకు పెట్టుబడి దున్నులు చాలు కాకముందే ఇచ్చేటోడు. ఇప్పుడు వానకాలం పోయింది. యాసంగి వస్తున్నా పెట్టుబడి ఇత్తమని అంట లేరు. మరి సన్న, చిన్నకారు రైతులుకు రైతుబంధు ఇస్తనే సాయం చేసినట్టు అయితది. మరి ఈ సర్కారు కూడా కేసీఆర్ లెక్కనే ఇయ్యాలే. ఇయ్యకుంటే రైతులు ఎం చేయ్యాలనో చేసి చూపిస్తరు.

– కాశబోయిన సంపత్, రైతు, హుస్నాబాద్

సర్కారుపై నమ్మకం పోయింది..

రైతుల గురించి ఒక్కో మంత్రి ఒక్కో తీరుగా మాట్లాడుతున్నరు. ముందుగా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిన వెంటనే రైతు భరోసా ఇస్తామన్నరు. ఇప్పుడు వర్షాకాలం పంటల సీజన్ అయిపోతున్నది. ఇంతవరకు రైతు భరోసా పైసలు వేయలేదు. సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఒక్కరికీ రైతు భరోసా ఇచ్చింది లేదు. కేవలం మాటలతోనే కాలం వెళ్లదీస్తున్నరు. ఇంత పనికి మాలిక ప్రభుత్వం దేశంలో మరెక్కడా ఉండదు. రైతులకు ప్రభుత్వం మీద నమ్మకం పోయింది.

– నారాయణరెడ్డి, రైతు, దిగ్వాల్, సంగారెడ్డి జిల్లా

కేసీఆరే నయముండే..

కరోనా అచ్చినప్పుడు కూడా కేసీఆర్ రైతులకు రైతుబంధు ఇచ్చిండు. కేసీఆర్ ఉన్నప్పుడే రైతులకు మంచిగుండే. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తున్నది. రైతు భరోసా పైసలను ఈ సీజన్‌కు జమ చేయమని మంత్రి ప్రకటించడం బాధేసింది. కాంగ్రెస్ సర్కారు గిట్లనే పాలన జేస్తంటే రైతులు గట్టిగానే బుద్ధి చెబుతారు.

–బిజ్జ సంపత్, రైతు, నందిగామ, మెదక్ జిల్లా

రైతులను నట్టేట ముంచిన రేవంత్ సర్కార్

బీఆర్ఎస్ నేతలు మాదాసు శ్రీనివాస్, దేవీ రవీందర్

గజ్వేల్, అక్టోబర్ 19: లెక్కకు మించి హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం ప్రజా సమస్యలు గాలిలోకి వదిలేసి రాక్షసానందం పొందుతున్నదని, రైతులను నట్టేట ముంచిందని గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీటీసీ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ విమర్శించారు. రైతుభరోసాపై మంత్రి తుమ్మల వ్యాఖ్యలకు నిరసనగా శనివారం గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు పక్షపాతిగా ఉంటామని చెప్పి, అధికారంలోకి రాగానే కాంగ్రెస్ సర్కారు అన్నింటిని విస్మరించి అన్నివర్గాలను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందని, హైడ్రాతో పేదల ఇండ్లు కూల్చడం రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రశ్నించే గొంతులకను నొక్కిపెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. గజ్వేల్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని చేపడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. కార్యక్రమంలో బెండే మధు, వెంకటేశంగౌడ్, జకీయొద్దీన్, మల్లేశం, బొల్లారం ఎల్లయ్య, కృష్ణాగౌడ్, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, గుంటుక రాజు, రమేశ్‌గౌడ్, చందు, సంతోష్‌రెడ్డి, కల్యాణ్‌కర్ శ్రీనివాస్, రఘుపతిరెడ్డి, హన్మంతరెడ్డి, మురళి, బాల్‌రాజు, దశరథ్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ సర్కారు

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, అక్టోబరు 19: అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలను మోసం చేసిందని, వానకాలం రైతు భరోసా ఇవ్వమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించడం సిగ్గుచేటని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో మీడియాతో ఆయన మాట్లాడారు.ఆరు గ్యారెంటీల్లో ఒక్క ఉచిత బస్సు ప్రయాణం మినహా ఏ ఒక్కటి అమలు చేయడం లేదని విమర్శించారు. రైతు భరోసా ఎకరాకు రూ.15వేలు ఇస్తామని ఇప్పటికీ ఇవ్వకుండా సర్కారు రైతులకు మొండిచేయి చూపిందని విమర్శించారు. సగం మందికే రుణమాఫీ చేసి అన్నదాతలను తీవ్రంగా ముంచిన ప్రభుత్వం కాంగ్రెస్‌ది అని ఆయన విమర్శించారు. కేసీఆర్ రైతులకు చేయూత నిస్తే, రేవంత్ రైతులను దగా కు గురిచేస్తున్నాడని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. పల్లె నుంచి హైదరాబాద్ వరకు కాంగ్రెస్ సర్కారులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు..

రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ సర్కారుకు రైతుల ఊసురు తగులుతుంది. రైతు భరోసా ఇస్తామని ప్రకటించి కాలయాపన చేసింది కాంగ్రెస్ సర్కారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతులకు వానకాలం రైతు భరోసా లేనట్టే అని ప్రకటించడం సిగ్గుచేటు. రైతులను ఇబ్బందులు చేసిన రేవంత్ సర్కారుకు ఎదురు దెబ్బ తగలడం ఖాయం. రైతు ఏడ్చిన రాజ్యం.. ఎద్దు ఏడ్చిన ఎవుసం బాగుపడదు. రైతుల ఆవేదనను రాక్షసానందం పొందుతున్న కాంగ్రెస్ సర్కారుకు రైతాంగం ఉసురు తగిలి కొట్టుకుపోతుంది.

– యంజాల సంజీవరెడ్డి, రైతు, అన్నారం, గుమ్మడిదల మండలం, సంగారెడ్డి జిల్లా

సర్కార్ రైతుల కడుపు కొడుతోంది..

కాంగ్రెస్ సర్కారు రైతుల కడుపు కొడుతోంది. రైతుబంధు ఇవ్వకుండా రైతులను ఆగంజేస్తున్నది. మొన్నటి వరకు ఇగ వేస్తాం..అగ వేస్తాం అని రైతులకు నమ్మించారు. ఇప్పుడు వానకాలంలో రైతుబంధు ఇవ్వమని రైతులకు ఎగనామం పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల ఆగం చేసే ప్రభుత్వమని రుజువు చేసింది. మా రైతుల ఉసురు సర్కారుకు తగులుతుంది.

–పల్లె నర్సింహులు, రైతు, ఖాదిరాబాద్, సంగారెడ్డి జిల్లా

రైతులతో పెట్టుకుంటోర్రు..

ఎన్నికలకు ముందు రైతులకు ఇది చేస్తం, అది చేస్తం అని మాయమాటలు చెప్పిండ్రు. అధికారంలోకి వచ్చినంక కాంగ్రెసోళ్లు రైతులను నట్టేట ముంచుతుండ్రు. కేసీఆర్ ఉన్నప్పుడు క్రమం తప్పకుండా రైతుబంధు అచ్చింది. రైతుబంధు డబ్బులు పెట్టుబడికి వాడుకున్నం. ఇప్పుడు పెట్టుబడి కోసం మునుపటి లెక్కనే వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేయాల్సి వస్తున్నది. రైతులతో పెట్టుకున్నోళ్లు ఎవలు బతికి బట్ట కట్టలే. రేవంత్ సర్కార్‌కు రైతుల ఉసురు తగిలి కొట్టుకు పోవడం ఖాయం.

–గోలిపల్లి నర్సిరెడ్డి, రైతు, నర్సాయపల్లి, సిద్దిపేట జిల్లా

మెదక్ జిల్లా అల్లాదుర్గంలో కోర్టు కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ విజయసేన్ రెడ్డి

మెదక్ కోర్టు ప్రాంగణంలో ప్రారంభించిన పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న హైకోర్టు జడ్జి విజయసేన్‌రెడ్డి

కోర్టుల ఏర్పాటుతో చేరువగా న్యాయం

హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్ రెడ్డి

అల్లాదుర్గం, అక్టోబర్ 19: పేదలకు న్యాయస్థానాలు మరింత చేరువ చేసేందుకే నూతనంగా కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గంలో నూతనంగా ఏర్పాటైన జూనియర్ సివిల్ జడ్జి ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ..నూతన సివిల్ కోర్టు ప్రారంభించుకోవడంతో రేగోడ్, శంకరంపేట, అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల వాసులకు సత్వర న్యాయం దొరుకుతుందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం మెయింటెనెన్స్ కేసులు త్వరగా పరిష్కరించాలని, చైల్డ్ కస్టడీ, విడాకులు, క్రిమినల్ కేసులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా జడ్జి లక్ష్మీశారద, సబ్ జడ్జి జితేందర్, సివిల్ కోర్టు న్యాయాధికారి రీటాలాల్ చంద్, నర్సాపూర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి అనిత, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుభాష్‌గౌడ్, జనరల్ సెక్రటరీ శ్రీపతిరావు, న్యాయవాదులు ప్రతాప్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సంగమేశ్వర్, కృష్ణారెడ్డి, బాలయ్య, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్, చిరంజీవి, రవి, శివచరణ్, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐలు ప్రవీణ్‌రెడ్డి, విఠల్, మహ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ప్రారంభం

మెదక్ అర్బన్, అక్టోబర్ 19: మెదక్ కోర్టు ప్రాంగణంలో పీహెచ్‌సీని హైకోర్టు జడ్జి విజయసేన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మెదక్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు కొన్ని సమస్యలు జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. మెదక్ సీఎస్ఐ చర్చిని జడ్జి సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్‌చంద్, నర్సాపూర్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి అనిత, మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రగౌడ్, శ్రీపతిరావు, పోచయ్య, ప్రతాప్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, బాలయ్య, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, చిరంజీవి, ప్రశాంత్ రులు ఉన్నారు.

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

భారీగా ఎండు గంజాయి స్వాధీనం

రామాయంపేటలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రామాయంపేట, అక్టోబర్ 19: మెదక్ జిల్లా రామాయంపేట వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయి లభ్యమైంది. రామాయం పేట పోలీసుల వివరాల ప్రకారం..హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న ఏపీకి చెందిన ఓ కారు మార్గమధ్యలో రామాయంపేట బైపాస్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది.ఈ ప్రమాదంలో కారులో ఉన్నవారికి గాయాలు కావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తెల్లవారు జామున హైవే పోలీసులు కారు వద్దకు వచ్చి పరిశీలించగా అందులో ఎండు గంజాయి ప్యాకెట్లు లభించాయి. రామాయంపేట ఎస్సై బాలరాజు ఆధ్వర్యంలో పోలీసులు కారులో తనిఖీలు చేయగా డిక్కీలో, సీట్ల కింద తదితర ప్రాంతాల్లో తరలిస్తున్న ఎండు గంజాయి ప్యాకెట్లు లభించాయి. మొత్తం 87కిలోల 75 గ్రాముల ఎండు గంజాయి లభించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజు తెలిపారు.